సాక్షి కామారెడ్డి

సోమవారం, 4, సెప్టెంబర్, 2023



మద్యానికి దూరం..

మాచారెడ్డి మండలంలోని రత్నగిరిపల్లె వాసులు మద్యపాన నిషేధం విధించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు.

- 9లో ▸



అందని 'ఆసరా'

ఆసరా ఆన్‌లైన్ దరఖాస్తుల వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో అర్హులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /22.7

వాతావరణం

ఉదయం చల్లగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఇంగ్లిష్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్ర రాంభాస్కర్ రాజు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. రాంభాస్కర్ రాజు గతంలో వరంగల్ జిల్లాలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తించారు. ఏడాదిన్నరగా బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికైనందుకు ఆనందంగా ఉందని రాంభాస్కర్ రాజు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇందూరు గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు. కాగా రాంభాస్కర్ రాజు స్పౌజ్ కేటగిరీలో ఈనెల 2న వరంగల్‌లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు.

తెయూ రిజిస్ట్రార్..



మోపాల్: తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్, కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎం యాదగిరిని రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో యాదగిరి అవార్డును అందుకోనున్నారు.

గిరిరాజ్ కాలేజీ అధ్యాపకుడు..

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల వాణిజ్యశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ లింగన్న రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. రెంజల్ మండలం బోర్గంకు చెందిన లింగన్న 2011లో లెక్చరర్ ఉద్యోగం పొందారు. అవార్డు రావడంతో ఆయనను పలువురు అభినందించారు.

ఆస్పత్రి సిబ్బందికి అభినందనలు

బాన్సువాడ: బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో గత నెలలో 504 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించిన నేపథ్యంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వారు ఆదివారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ పి.సుధ, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో వైద్యులు, వైద్య సిబ్బంది పని చేయాలని సూచించారు.

'బీర్కూర్ రూపురేఖలు మారుతున్నాయి'




బాన్సువాడ: బీర్కూర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో మండల కేంద్రం రూపురేఖలు మారుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీర్కూర్‌లో రూ.75 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, రైతు బంధు అధ్యక్షుడు అవారి గంగారం, నాయకులు శశికాంత్, కొల్లి గాంధీ, మన్నాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 10 వరకు పలు రైళ్లు రద్దు

సుభాష్‌నగర్: నిజామాబాద్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను సోమవారం నుంచి 10వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లలో నిర్వహణ (మెయింటెన్స్) పనులు కొనసాగడంతో రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్-కరీంనగర్ రైలు, కరీంనగర్- నిజామాబాద్ రైలును రద్దు చేశారు. డోన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్లే రైలు ఆదివారం నుంచి 9వ తేదీ వరకు, నిజామాబాద్ మీదుగా పండరీపురం వెళ్తున్న రైలు సోమవారం నుంచి 10వ తేదీ వరకూ రద్దయినట్లు తెలిపారు.

ప్రగతిభవన్‌కు పిలుపు



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ ఫోకస్ పెరిగింది. ఇందులో భాగంగా ముఖ్య నేతలకు ప్రగతి భవన్ నుంచి పిలుపువచ్చింది. ఈనెల 7న పార్టీ ముఖ్య నేతలతో సీఎం కేసీఆర్ సమావేశం కానున్నారు. సీఎం పోటీ నేపథ్యంలో జరుగుతున్న తొలి సమావేశం కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

– సాక్షి, కామారెడ్డి

- 7న కామారెడ్డి గులాబీ నేతలతో సమావేశమవనున్న కేసీఆర్
- నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించే అవకాశం
- సీఎం పోటీ నేపథ్యంలో జరిగే తొలి సమావేశంపై ఆసక్తి

కామారెడ్డి నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేయనుండడంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాలూ దూకుడు పెంచాయి. తాము బలంగా ఉన్నామన్న సందేశాన్ని ప్రజలకు చేరవేయడానికి విపక్ష నేతలూ పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయడానికి బీఆర్‌ఎస్ సైతం ప్రణాళికలు రచిస్తోంది. జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో గురువారం ప్రగతిభవన్‌లో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సీఎం నిర్వహించే ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో పాటు నియోజకవర్గంలోని ముఖ్య నేతలు పాల్గొంటారని తెలుస్తోంది. ఏయే అంశాలపై చర్చిస్తారన్న దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, చేయాల్సిన పనుల గురించి సమావేశంలో చర్చిస్తారని సమాచారం. జిల్లా కేంద్రంగా ఎదిగిన కామారెడ్డి పట్టణంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. రోడ్ల వెడల్పు పనులు కూడా ముందుకు సాగడం లేదు. జంక్షన్ల అభివృద్ధి అంశం మరుగున పడింది. స్థానికంగా ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. పట్టణాన్ని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి. అభివృద్ధితోపాటు నియోజక వర్గంలో పార్టీ పరిస్థితి, ప్రతిపక్షాల బలాబలాలపైనా చర్చించే అవకాశాలున్నాయి.

భవనాల కోసం వెతుకులాట

సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో పార్టీ ముఖ్య నేతలు కామారెడ్డి కేంద్రంగానే పనిచేయనున్నారు. ముఖ్యనేతలంతా మూడు నెలలకుపైనే ఇక్కడ మకాం వేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ స్థానిక నేతలు వారికి సౌకర్యాలు సమకూర్చే పనిలో ఉన్నారు. దీనికోసం స్థానికంగా అన్ని సౌకర్యాలున్న భవనాలను అన్వేషిస్తున్నారు. జిల్లా కేంద్రంలో అనుకూలమైన భవనాలు ఎక్కడెక్కడ ఉన్నాయని ఆరా తీస్తున్నారు. కోర్టు కేసులతో మినీ తెలంగాణ భవన్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో పార్టీకి జిల్లా కార్యాలయం కూడా లేదు. ఈ నేపథ్యంలో అన్ని హంగులతో ఉన్న భవనాలకోసం పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్నికలకు సమాయత్తం చేసే దిశగా..

నియోజకవర్గంలో నేతల మధ్య సమన్వయం కుదిర్చి ఎన్నికలకు సమాయత్తం చేసే యోచనలో బీఆర్‌ఎస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో నేతల మధ్య ఉన్న నెలకొన్న విభేదాలపై సమావేశంలో చర్చించి వాటిని పరిష్కరిస్తారని భావిస్తున్నారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ఈ సమావేశంలో సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

ఎంతమంది హాజరవుతారు?

సీఎంతో సమావేశానికి నియోజకవర్గ నేతలను ఎంతమందిని పిలుస్తున్నారన్న విషయమై స్పష్టత లేకపోయినా.. మండలానికి ఐదు నుంచి పది మందిని పిలుస్తారని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. స్థానిక నేతలతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు. నియోజక వర్గంలో పార్టీ ఎన్నికల సమన్వయ బాధ్యతను ఎవరికి అప్పగిస్తారన్న దానిపై సమావేశం అనంతరం స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

పంటలకు ప్రాణం పోసిన వాన

- జిల్లా అంతటా వర్షాలు
- ఊపిరి పీల్చుకున్న రైతులు



లింగంపేట పెద్దవాగులో నీటి ప్రవాహం

సాక్షి, కామారెడ్డి: కొన్నాళ్లుగా వర్షాల జాడలేక ఎండుముఖం పట్టిన పంటలను వరుణుడు ఆదుకున్నాడు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4.85 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జూన్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా.. జూలైలో భారీ వర్షాలు కురవడంతో చెరువులు, ప్రాజెక్టులన్నీ నిండాయి. దీంతో లక్ష్యానికి అనుగుణంగా పంటలు సాగయ్యాయి. అయితే గతనెలలో వర్షాలు కురియకపోవడం, వారం, పది రోజులనుంచి ఎండల తీవ్రత కూడా పెరగడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఆందోళన చెందుతున్న రైతులకు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మొదలైన వర్షం ఊరటనిచ్చింది. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం 8 గంటల వరకు భిక్కనూరులో 61.4 మి.మీ., దోమకొండలో 45.4 మి.మీ., సదాశివనగర్‌లో 45 మి.మీ., రామారెడ్డిలో 36.5 మి.మీ., కామారెడ్డిలో 35.3 మి.మీ., తాడ్వాయిలో 28.5 మి.మీ., రాజంపేటలో 28.3 మి.మీ., మాచారెడ్డి, పాల్వంచలో 24.1 మి.మీ., బీబీపేటలో 20.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వరికి ఊపిరి..

జిల్లాలో 2.85 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. బోర్లు, బావులపై ఆధారపడి లక్షకుపైగా ఎకరాల్లో వరి వేశారు. అయితే వర్షాలు లేకపోవడానికి తోడు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో పంటకు నీరందించడం కష్టంగా మారింది. కరెంటు కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. పలుచోట్ల సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలూ చేశారు. ఈ సమయంలో కురిసిన భారీ వర్షంతో పంటకు ప్రాణం వచ్చినట్లయ్యిందని రైతులు పేర్కొంటున్నారు.

'ఆరుతడి' గట్టెక్కినట్లేనా?

జిల్లాలో 83 వేల ఎకరాల్లో సోయా, 59 వేల ఎకరాల్లో మక్క, 48 వేల ఎకరాల్లో పెసర, 26 వేల ఎకరాల్లో పత్తి పంటలు సాగయ్యాయి. సుమారు రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఇక పంట చేజారినట్టేనని భావిస్తున్న తరుణంలో వర్షాలు కురవడంతో పంటలకు మేలు జరిగింది. లేకుంటే భారీగా నష్టం జరిగేదని పేర్కొంటున్నారు.

'పోచారం'లోకి స్వల్ప ఇన్‌ఫ్లో



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి ఆదివారం స్వల్ప ఇన్‌ఫ్లో మొదలైంది. గాంధారి, లింగంపేట మండలాల్లో కురిసిన వర్షాలతో లింగంపేట పెద్దవాగు ద్వారా ప్రాజెక్టులోకి 2,958 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 118 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.778 టీఎంసీ నీరు నిల్వ ఉందని నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

మద్నూర్‌లో కొలువుదీరిన బాలాజీ జెండా

మద్నూర్: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం తిరుమల తిరుపతి బాలాజీ జెండా కొలువుదీరింది. పాత బస్టాండ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు, జెండా కమిటీ సభ్యులు జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. ఏటా గణేశ్ విగ్రహ నిమజ్జనం అనంతరం తిరుమల జెండా వచ్చేదని, ఈసారి అధిక మాసం రావడంతో చవితికి ముందే వచ్చిందని కమిటీ సభ్యులు తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వరుడి జెండా మద్నూర్‌లో 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకుంటుందని బాలాజీ జెండా కమిటీ సభ్యులు తెలిపారు. 11 రోజుల పాటు మండల కేంద్రంలో జెండాకు పూజలు నిర్వహించిన అనంతరం తిరుమల శ్రీవారి ఆలయానికి పంపిస్తామని పేర్కొన్నారు.

షబ్బీర్ అలీకి లైన్‌క్లియర్!

- కాంగ్రెస్ కామారెడ్డి నియోజకవర్గ అభ్యర్థిత్వం ఖరారు!
- త్వరలో ప్రకటించనున్న పార్టీ అధిష్టానం
- ఎల్లారెడ్డి నుంచి ఇద్దరి పేర్ల పరిశీలన
- బాన్సువాడ, జుక్కల్‌లలో ముగ్గురి పేర్లు సిఫారసు

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు ప్రక్రియ కొనసాగుతోంది. పార్టీ నాయకత్వం దరఖాస్తులను వడపోసి, ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు, ముగ్గురు పేర్లతో జాబితాను రూపొందించింది. కామారెడ్డి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. ఎల్లారెడ్డి నుంచి నలుగురు దరఖాస్తు చేసుకోగా.. వాటిని పరిశీలించిన పీసీసీ ఎన్నికల కమిటీ.. పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావుల పేర్లను సిఫారసు చేసింది. జుక్కల్ నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురి పేర్లను ఎంపిక చేశారు. మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్‌తో పాటు తోట లక్ష్మీకాంత్‌రావ్‌ల పేర్లు జాబితాలో ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గం టికెట్టు కోసం 16 మంది దరఖాస్తు చేసుకోగా.. నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజు పేరుతో పాటు మరో ఇద్దరి పేర్లను ఎంపిక చేశారు. వారి వివరాలు తెలియరాలేదు. ఈ జాబితాను స్క్రీనింగ్ కమిటీ పరిశీలించిన అనంతరం పార్టీ కేంద్ర నాయకత్వానికి పంపిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

ఘనంగా 'గంప' తనయుడి వివాహం



వధూవరులతో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- వధూవరులను ఆశీర్వదించిన సీఎం కేసీఆర్
- వేడుకలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనయుడు శశాంక్ వివాహం సుప్రియతో ఆదివారం హైదరాబాద్ నగర శివార్లలోని జెన్వి కన్వెన్షన్‌లో జరిగింది. సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీలు బీబీపాటిల్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

పార్టీ శ్రేణులతో సీఎం మాటామంతి

గంప గోవర్ధన్ తనయుడి వివాహ వేడుకకు హాజరైన సీఎం కేసీఆర్.. పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు. సీఎంతో ఫొటోలు దిగడానికి శ్రేణులు ఉత్సాహం చూపాయి. సెక్యూరిటీ కొంత ఇబ్బంది అయినా, చాలామంది సీఎంతో కరచాలనం చేశారు. కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న నేపథ్యంలో స్థానిక నేతలంతా సీఎంతో ఫొటో దిగడానికి పోటీ పడ్డారు.



మంత్రి హరీశ్‌రావు..



ఫంక్షన్ హాల్ వద్ద సీఎంతో సెల్ఫీలు దిగుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

బీజేపీలో ఎన్నికల సందడి!

కాషాయ సేనలో ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాలని యోచిస్తున్నవారినుంచి రాష్ట్ర నాయకత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పార్టీ టికెట్లు ఆశిస్తున్నవారంతా దరఖాస్తు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి

- అభ్యర్థిత్వం కోసం దరఖాస్తుల ఆహ్వానం
- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- సన్నద్ధమవుతున్న ఆశావహులు

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇదే సమయంలో అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు ముమ్మరం చేశాయి. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించి ముందుండగా.. కాంగ్రెస్ ఆశావహులనుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులను పరిశీలన ప్రక్రియ కూడా పూర్తి కావచ్చింది. ఈ నేపథ్యంలో మరో ప్రధాన పక్షమైన బీజేపీ సైతం కసరత్తు ప్రారంభించింది. అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. ఆశావహులు ఈనెల 10 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది.

కామారెడ్డిలో..

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి పలువురు నేతలు బీజేపీ టికెట్టు ఆశిస్తున్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఉద్యమించారు. గజ్వేల్‌లో అభివృద్ధి డొల్ల అని ఆరోపిస్తున్న ఆయన.. చలో గజ్వేల్ కార్యక్రమానికి పిలుపునిచ్చి చర్చకు తెరలేపారు. ప్రజల పక్షాన ఉద్యమిస్తున్న తనకే పార్టీ టికెట్టు ఇస్తుందని భావిస్తున్న ఆయన.. కేసీఆర్‌పై పోటీ చేసి విజయం సాధిస్తానన్న ధీమాతో ఉన్నారు. పార్టీ సీనియర్ నేతలైన మురళీధర్‌గౌడ్, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, ఇట్టం సిద్దరాములు కూడా టికెట్టు ఆశిస్తున్నారు.

జుక్కల్‌లో..

జుక్కల్ నియోజకవర్గం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆమె ఇప్పటికే నియోజకవర్గంలో ఊరూరా తిరిగారు. టికెట్టు తనకే వస్తుందన్న ధీమాతో ఆమె ఉన్నారు. కాగా ఇక్కడి నుంచి పోటీ చేయడానికి ఓ ఎన్నారై కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

బాన్సువాడలో..

బాన్సువాడ నుంచి మాల్యాద్రిరెడ్డి టికెట్టు రేసులో ఉన్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు నేతలు కూడా టికెట్టు ఆశిస్తున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పోటీలో ఉంటారని భావించారు. అయితే ఆయన కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక్కడినుంచి పోటీ చేయడానికి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డితో పాటు నాయకులు పైలా కృష్ణారెడ్డి, బైండ్ల పోచయ్య, బాపురెడ్డి తదితరులు ఆసక్తి చూపుతున్నారు. రామలక్ష్మణ్‌పల్లికి చెందిన ప్రముఖ సర్జన్ రాంసింగ్ బీజేపీ టికెట్టు రేసులో ఉన్నారని సమాచారం. ఎల్లారెడ్డికి చెందిన మరో వైద్యుడు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఏ నియోజక వర్గం నుంచి ఎవరెవరు టికెట్టు ఆశిస్తున్నారన్నది దరఖాస్తుల స్వీకరణ అనంతరం వెల్లడి కానుంది.

'4,510 దరఖాస్తులు వచ్చాయి'



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లాలో శని, ఆదివారాలలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి 4,510 దరఖాస్తులు వచ్చాయి. ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ పాటిల్ భిక్కనూరు మండలంలో పర్యటించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. కామారెడ్డిలోని పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ సందర్శించారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఓటరు నమోదు కు 3,484 దరఖాస్తులు, మార్పులు, చేర్పులకు 804, తొలగింపులకు 222 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

● దిండి పాదయాత్ర



మహారాష్ట్రలోని లాడేగావ్‌కు చెందిన భక్తులు మారుతి మహరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన దిండి పాదయాత్ర ఆదివారం మండలం మీదుగా సాగింది. ఈ సందర్భంగా మారుతి మహరాజ్ మాట్లాడుతూ ఏటా శ్రావణమాసంలో ఈ యాత్ర చేపడతామన్నారు. పిట్లం మండలం చిన్నకొడప్‌గల్‌లోని రామేశ్వర్ శివాలయం వరకు యాత్ర సాగుతుందని పేర్కొన్నారు. యాత్రలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

– పెద్దకొడప్‌గల్(జుక్కల్)

క్లుప్తంగా

రాజీ మార్గంతో కేసుల నుంచి విముక్తి


ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: కోర్టు కేసుల నుంచి రాజీ మార్గంతోనే విముక్తి పొందవచ్చని ఎస్సై సాయికుమార్ అన్నారు. పీఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈ నెల 9న లోక్ అదాలత్ ఉంటుందని పెండింగ్ కేసులు ఉన్నవారు సద్వినియోగం చేసుకొని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు.

8, 9 తేదీల్లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 8న అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగంలో, ఈ నెల 9న అండర్–8, 10, 12, మెన్, ఉమెన్ విభాగంలో ఉదయం 10గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు ఈ నెల 6 లోగా 9989040776 నంబర్‌కు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్పలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి ప్రధాన చౌరస్తాలో చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉపసర్పంచ్ జగదీశ్ విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన సన్మానం



బాల్కొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పొలిశెట్టి లక్ష్మీనారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తన స్వగ్రామంలోని ఆలయంలో స్థానికులతో కలిసి పూజలు చేయడం ఆనందంగా ఉందని జడ్జి అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, నాయకులు జడ్జిని సన్మానించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి హైకోర్టు న్యాయమూర్తి కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్చర్ల లక్ష్మి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గండికి మరమ్మతులెప్పుడో..!

- దెబ్బతిన్న లక్ష్మికాలువ
- పట్టించుకోని అధికారులు


నల్లూర్ శివారులో లక్ష్మికాలువపై ఏర్పడిన గండి

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటిసరఫరా చేసే లక్ష్మి కాలువపై ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో గండి పడింది. జూలైలో భారీ వర్షాలు కురవడంతో కాలువ ఓ వైపు నుంచి భారీ వరద వచ్చి కాలువ కట్ట కోతకు గురైంది. దీంతో కాలువ కట్టకు గండి ఏర్పడింది. కాలువపై పలు చోట్ల సైఫాన్లను నిర్మించారు. కాలువ ఎగువ భాగం నుంచి దిగువ భాగానికి నీటిని దాటించేందుకు నిర్మించినవే సైఫన్లు. కానీ అవి పూర్తిగా పూడికతో నిండిపోవడంతో నీరు పక్కకు వెళ్లి కాలువ కట్ట కోతకు గురవుతోంది. ముప్కాల్ శివారులో భారీ గండి ఏర్పడింది. దీంతో అయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

150 క్యూసెక్కులే వదులుతున్న వైనం..

ప్రాజెక్ట్ నుంచి లక్ష్మికాలువ ద్వారా గరిష్ఠంగా 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారు. ఎక్కువగా నీరు వదిలితే గండి పడిన ప్రాంతంలో నీరు వృథా అవుతుంది. దీంతో అంత కంటే ఎక్కువ వదలలేని పరిస్థితి ఏర్పడింది. కాలువ సామర్థ్యం 500 క్యూసెక్కులు. కానీ ఈ మధ్యకాలంలో 300 క్యూసెక్కులకంటే ఎక్కువ వదిలిన దాఖలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి లక్ష్మి కాలువపై ఏరడిన గండ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. నీటి విడుదలను సైతం పెంచాలని వేడుకుంటున్నారు.

మరో ఫీటు తగ్గించండి సారూ..!

- చెక్ డ్యాం గోడ తగ్గించాలని వెంచిర్యాల్ రైతుల వేడుకోలు


చెక్ డ్యాంపై కూల్చేసిన గోడ

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ శివారులో పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ఎత్తు మరో ఫీటు తగ్గించాలని గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చెక్ డ్యాం గోడ ఎత్తుగా కట్టడంతో రెండు సంవత్సరాలుగా వర్షాలు కురిసినప్పుడల్లా వాగులో నిండిన నీరు పొలాల్లోకి చేరుతోంది. దీంతో ఏటా 320 ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. తాజాగా ప్రస్తుత సంవత్సరం కూడా గత నెలలో కురిసిన వర్షాలతో తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది. పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం అడ్డుకట్ట ఎత్తును తగ్గించేందుకు ప్రొక్లయిన్‌తో తవ్వకాలు చేపట్టింది. నిర్మించిన అడ్డుకట్టను సుమారు 3 ఫీట్లు తొలగిస్తే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రెండు ఫీట్లు తొలిగించారు. అయినా నీరు ఎక్కువగా నిల్వ ఉంటోంది. మళ్లీ వర్షాలు కురిస్తే వరద పొంగి పంటలకు నష్టం వాటిల్లక ముందే పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇంకా కోలుకోని పంటలు..

గత నెలలో కురిసిన వర్షాలతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో మక్క, పసుపు, సోయా, వరి పంటలు కొట్టుకుపోయాయి. పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చెక్‌డ్యాం గోడను మరో ఫీటుకు తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జోరు వానలోనూ ఆగని నిరసన

- ఏడో రోజుకు చేరిన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్ష
- విద్యాశాఖలో విలీనం చేయాలని ఆందోళన


వానలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి రూరల్: తమ సర్వీసులను రెగుల్యరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షఅభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష ఆదివారం ఏడో రోజుకు చేరింది. భారీ వర్షం కురుస్తున్నా తమ లక్ష్యసాధనకు జిల్లాలో 500 మంది వర్షంలో తడుస్తూ దీక్షను కొనసాగించారు. 15 సంవత్సరాల నుంచి విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. బంగారు తెలంగాణ వచ్చినా తమకు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానా, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో రెగ్యులర్ చేశారని తెలంగాణ రాష్ట్రంలో ఇంకా అమలు కావడం లేదన్నారు. తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసేంత వరకు న్యాయ పోరాటం చేస్తామని జేఏసీ నాయకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. దీక్షలో జిల్లా నాయకులు దామోదర్ వాసంతి, రాములు శైలజ, మాధవీ సంతోష్‌రెడ్డి, సంపత్, వీణ, కాళీదాస్, కళ్యాణ్, సంజీవులు నాయకులు తదితరులు ఉన్నారు.

సమాజంలో మంచి గుర్తింపు సాధించాలి


సమ్మేళనంలో 2001-2003 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: సమాజంలో మంచి గుర్తింపుతోనే గౌరవ, మర్యాదలు లభిస్తాయని రిటైర్డ్ జిల్లా రీజినల్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ బీఆర్ నర్సింగ్‌రావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సంక్షేమ గురుకుల కళాశాలలో 2001–2003 ఇంటర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, అధ్యాపకులు కె.నాగేశ్వర శాస్త్రీ, డి.కిషన్, పి.నర్సింహా, కళాశాల పర్యవేక్షకుడు, కె.రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు


నుజ్జునుజ్జయిన కారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గేట్ వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. లింగంపేట మండలం లొంకలపల్లికి చెందిన కౌశిక్‌రెడ్డి, గోపాల్‌పేటకు చెందిన వెంకటసాయిగౌడ్ శనివారంరాత్రి ప్రయాణిస్తున్న కారు మాల్తుమ్మెద గేట్ వద్ద అడవిపందులు అడ్డు రావడంతో అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నది. ఈ ఘటనలో కౌశిక్‌రెడ్డికి రెండుకాళ్లు విరగ్గా, వెంకటసాయిగౌడ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కౌశిక్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరి గల్లంతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ ఊర చెరువులో పడి ఒకరు గల్లంతైనట్లు ఎస్సై ఎల్ రాము ఆదివారం తెలిపారు. కులాస్‌పూర్‌కు చెందిన కటికె హుస్సేన్ (57) శనివారం సాయంత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆదివారం చెరువు కట్టపై హుస్సేన్ చెప్పులు, సెల్ ఫోన్ లభ్యమైనట్లు చెప్పారు.

మద్యానికి బానిసైన హుస్సేన్ జీవితం మీద విరక్తితో చెరువులో దూకి ఉంటాడని పోలీసులు తెలిపారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హుస్సేన్‌భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మో కుక్కలు..

- నెల రోజుల్లో 94 మందిని గాయపర్చిన కుక్కలు, కోతులు
- భయాందోళనలో ప్రజలు


సోమార్‌పేట్ శివారులో తిరుగుతున్న కుక్కల మంద


దేవునిపల్లి శివారులో కోతుల గుంపు

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): గ్రామాల్లో కోతులు, కుక్కలను చూడగానే జనాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కోతుల మందతో పాటు, కుక్కల మంద సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోతులను అటవీ ప్రాంతాలకు తరలించేలా, కుక్కలకు వ్యాక్సిన్లు వేసి వాటి సంతానం పెరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో నెల రోజుల వ్యవధిలో కుక్కలు, కోతుల దాడిలో సుమారు 94 మంది గాయపడ్డారు. కుక్కల దాడిలో 32 మంది, కోతుల దాడిలో 32 మంది గాయపడగా ప్రభుత్వ ఆస్పత్రిలో మొదటి డోసు వ్యాక్సిన్లు వేయించుకున్నారు. అంతేకాకుండా మండలంలో మూడు, నాలుగు డోసుల వ్యాక్సిన్లు వేసుకున్న వారు మరో 83 మంది ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. దుకాణాల నుంచి కొనుగోలు చేసే సామాగ్రిని కోతులు దాడి చేసి లాక్కెళ్తున్నాయని, ఇంటి మీద ఉన్న కూన పెంకలను, కవర్లను చించేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి కోతులను అటవీ ప్రాంతాలకు తరలించి, కుక్కలకు సంతాన వృద్ధి కలుగకుండా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కోతుల దాడిలో గాయపడ్డా..

ఇంటి దగ్గర పనులు చేసుకుంటున్న సమయంలో కోతులు మీద పడి దాడి చేయడంతో గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నా. కోతుల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించాలి.

–హుల్లీబాయి, హాజీపూర్ తండా

కుక్కలు బాగా పెరిగిపోయాయి

దారిన వెళ్తున్న సమయంలో కుక్కలు గొడవ పడి కరిచాయి. దీంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నాను. గ్రామంలో కుక్కలు బాగా పెరిగి పోయాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–పోచవ్వ, గండిమాసానిపేట

మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు

- తోరణాలకు పరిమితమైన వైనం
- పట్టించుకోని అధికారులు



తోరణానికి పరిమితమైన పిట్లం క్రీడా ప్రాంగణం


మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న కిట్లు

నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ గ్రామీణ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా, క్రీడా ప్రాంగణాలు యువతకు శాపంగా మారుతున్నాయి. గతంలో క్రీడా పోటీలకు అనువైన ఆట స్థలాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు తోరణాలకే పరిమితమవుతున్నాయి. దీంతో క్రీడలు ఎలా ఆడేదంటూ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా 161 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. అన్ని జీపీలతో పాటు అనుబంధ గ్రామాల్లో కలిపి 687 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది జూన్‌లో అన్ని గ్రామ పంచాయతీల్లో, అనుబంధ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీ, ఈజీఎస్ శాఖల ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పనులు చేపట్టారు. కానీ జీపీల్లో ప్రభుత్వ స్థలాలు, అరకొరగా ఉన్న స్థలాలు క్రీడాప్రాంగణాలకు అనువుగా లేకపోవడంతో క్రీడల్ ప్రాంగణాలకు గ్రహణం పట్టుకుంది. ఇప్పటి వరకు జిల్లాలో 457 క్రీడా ప్రాంగణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు 2 ఎకరాల ప్రభుత్వ స్థలం అవసరం. అయితే సదరు క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్, కబడ్డీ కోర్టులు, సింగిల్, డబుల్ బాల్ పోటీలు సదుపాయలు కల్పించాల్సి ఉంది. అంతేకాకుండా క్రీడా ప్రాంగణం చుట్టూ 400 మొక్కలు నాటడంతో పాటు ప్రాంగణం చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 3.5 లక్షల చొప్పున కేటాయించారు. గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాన్ని చదును చేసి, తోరణాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కొన్ని గ్రామ పంచా యతీల్లో కంచెను ఏర్పాటు చేసి, క్రీడలకు అవసరమైన స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు క్రీడల నిర్వహణకు అనువుగా లేకపోవడంతో యువకులు ఆటలకు దూరం అవుతున్నారు.

మండల కార్యాలయాల్లో కిట్లు

తెలంగాణ గ్రామీణ క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలు, ఆట వస్తువులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆయా జీపీలకు సంబంధించిన క్రీడా పరికరాలు, సామగ్రి మండల పరిషత్ కార్యాలయాల్లో నిల్వ ఉన్నాయి. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, లాంగ్ జంప్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలకు సంబంధించిన కిట్లు సరఫరా అయ్యాయి. అయితే గ్రామ పంచాయతీల్లో మాత్రం క్రీడా ప్రాంగణాలు తోరణాలకే పరిమితం కావడంతో గ్రామీణ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షల విలువ చేసే క్రీడా సామగ్రితో పాటు క్రీడా ప్రాంగణాలు యువతకు ఉపయోగపడే విధంగా జిల్లా అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి

గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడలకు సంబంధిచిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. క్రీడా ప్రాంగణాలు తోరణాలకు పరిమితం కాకుండా క్రీడాకారులకు దోహదపడేలా ఉండాలి. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా అధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఇమ్రాన్, క్రీడాకారుడు, పిట్లం

క్రీడాకారులను ప్రోత్సహించాలి

గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి. జీపీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో పాటు సకల సదుపాయాలు కల్పించాలి. క్రీడలపై గ్రామ యువతకు మంచి ఆసక్తి ఉంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న క్రీడాపరికరాలు వృథా కాకుండా చూడాలి.

– ఉమర్, యువకుడు, పిట్లం

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ తండాకు చెందిన ధరావత్ శ్రీనివాస్(19) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన శ్రీనివాస్ తన తల్లిదండ్రులు మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఆగస్టు 30న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామంలో బ్యాగరి కాశీరామ్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని పెద్దవాగు పరివాహక ప్రాంతంలో విద్యుత్ తీగ ఈదురు గాలులకు తెగి మేత మేస్తున్న ఎద్దుపై పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఎద్దు విలువ రూ. లక్ష వరకు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

మృతదేహం లభ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ నల్లకుంట చెరువులో రెండ్రోజుల క్రితం గల్లంతైన చెంచయ్య (32) మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్సై ఎల్ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన చెంచయ్య పని నిమిత్తం కులాస్‌పూర్‌లోని ఇటుక బట్టీలో ఉన్న బంధువుల వద్దకు వచ్చాడు. శుక్రవారం సాయంత్రం స్థానిక నల్లకుంట చెరువులో కొంగలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆది వారం మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఊరు చెరువులో మరో మృతదేహం..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కులాస్‌పూర్ ఊర చెరువులో సుభద్ర (60) మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సుభద్ర బీడీలు, ఇతర పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. కొన్నాళ్లుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోందని, నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి అక్క లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల మాలోత్ తండాకు చెందిన రమావత్ రూప్‌సింగ్(76) అనారోగ్యంతో ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. రూప్‌సింగ్ మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పారు.మృతుని భార్య దస్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దేమికలాన్‌లో పెళ్లి ఆటో బోల్తా

- ఒకరి పరిస్థితి విషమం, పలువురికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని దేమికలాన్ శివారులో శనివారం రాత్రి పెండ్లి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమం కాగా పలువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కస్‌కల్ గ్రామానికి చెందిన అమ్మాయితో సంగోజివాడికి చెందిన ప్రశాంత్‌తో ఆదివారం వివాహం జరగాల్సి ఉంది. వధువు ఇంటి వద్ద శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాల్లో వరుడి కుటుంబీకులు పాల్గొని వస్తుండగా ఆటో డ్రైవర్ పోశయ్య అజాగ్రత్త వల్ల ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉందని, పలువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పెద్ద దేవీసింగ్ తండాలో ఒకరి అదృశ్యం


భామన్ దేవీలాల్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పెద్ద దేవీసింగ్ తండాకు చెందిన భామన్ దేవీలాల్ అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు ఆదివారం తెలిపారు. తండాకు చెందిన భామన్ దేవీలాల్ కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆగస్టు 31న ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదన్నారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. బీ ఫార్మ, బయోమెడికల్, బయో టెక్నాలజీలో ప్రవేశం పొందేవారు రెండు రోజులు స్లాట్‌బుక్ చేసుకున్న విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కళాశాలల ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 11 నుంచి 14 వరకు సీట్లు పొందిన వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహంలో వంట చేయడానికి వంట మనిషి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిచ్‌పల్లి కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో జీ సవిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసు కునే వారు పదోతరగతి పాసై ఉండాలని, సెప్టెంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు 6305148916, 9182322310 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.